క్లుప్తంగా

క్రీడా పోటీల్లో రాణించడం అభినందనీయం



మాచర్ల: ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన పోలీసు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ క్రీడా పోటీల్లో 200, 400 పరుగు పోటీలు, లాంగ్‌జంప్‌లో బంగారు పతకం సాధించిన హెడ్‌కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎస్కార్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రామకృష్ణ క్రీడా రంగంలో రాణించడం అభినందనీయమన్నారు. అనంతరం రామకృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మాజీ మున్సిపల్ చైర్మన్ బోయరఘురామిరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల గ్రామ శివార్లో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ సామెల్ రాజీవ్‌కుమార్ బుధవారం తెలిపారు. దాచేపల్లి మండలం సారంగపల్లెకు చెందిన తోటపాటి ఆదినారాయణ(40) ఆదివారం మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో మైసమ్మ అమ్మవారి ఆలయంలో పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి 7.30 సమయంలో గుర్తు తెలియని వాహనం ముందు వెళ్తున్న ఆదినారాయణ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఆదినారాయణ తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య అంజలి, దివ్య, నవ్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి



సత్తెనపల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయా రాణి అన్నారు. పల్నాడు జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టీంకు 8 మంది విద్యార్థులు, ఎస్‌జీఎఫ్ అండర్-17 గుంటూరు జిల్లా టీంకు ఇద్దరు పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. హెచ్ఎం సిస్టర్ విజయా రాణి మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ పొంది జిల్లాస్థాయి పోటీల్లో రాణించాలన్నారు.ఈ కార్యక్రమంలో పీఈటీ ఎస్.అచ్చిరెడ్డి, రాజా పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీలకు శావల్యాపురం విద్యార్థులు



శావల్యాపురం: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌లో శావల్యాపురం హైస్కూలు విద్యార్థులు అండర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో ఓర్సు మరనాథ్, దేవరాజ్ ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి బుధవారం తెలిపారు. పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు అనంతరం నియోజకర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈనెల 6న చేబ్రోలు మండలం వేజండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల నిర్వహించనున్న ఉమ్మడి గుంటూరు జిల్లాల అండర్-17 బాలుర పోటీల్లో వాలీబాల్ జట్టుకు ఎంపిక పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు,భువనేశ్వరీ, శ్రీకాంత్, సుభాష్‌చంద్రారెడ్డి, హనిమిరెడ్డి ఉన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి

రాజుపాలెం: ఖాళీగా ఉన్న పొలాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళీ రైతులకు సూచించారు. గణపవరం రైతు భరోసా కేంద్రంలో ఈకేవైసీ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్బరామిరెడ్డి, డాక్టర్ విజయనందన్, డాక్టర్ ముకుందరావు, డాక్టర్ జీఎంయూ ప్రసాద్, డాక్టర్ రమేష్ రైతులతో మాట్లాడారు. పత్తి, మిరప పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. క్రోసూరు ఏడీఏ హనుమంతరావు, వ్యవసాయాధికారి పి.వెంకట నరసయ్య పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: గంజాయి విక్రయం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్ర బాబు బుధవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు పెదచెరువు మొదటి లైన్‌లో తనిఖీలు నిర్వహించి అక్రమంగా గంజాయి కలిగిఉన్న నాదెండ్ల మండలం భుక్కాపురం గ్రామానికి చెందిన అల్లం శివశంకర్‌ను అరెస్ట్ చేశామన్నారు.

పేదలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: పేదవాడి ఆరోగ్యాన్ని మెరుగు పరచటమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని భవనాశి యల్లారావు కల్యాణ మండపంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల ప్రాంతం నుంచి అయినా పేదవాడు హైదరాబాద్‌లోని అపోలో హాస్పటల్‌లో చికిత్స పొందే విధంగా దివంగత మహానేత రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ తీసుకొచ్చారని ఆయన అన్నారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వ ఏర్పడి ఆరోగ్యశ్రీ పథకానికి తూట్లు పొడిచిందని ఆయన తెలియజేశారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటికి నుంచి అంతర్జాతీయ స్థాయి వైద్యప్రమాణాలు తీసుకురావాలని ఆయన కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. దాచేపల్లి పట్టణంలో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లను తీసుకొచ్చామన్నారు. గురజాల పట్టణంలో ఒక అర్బన్ హెల్త్ సెంటర్‌ను, పిడుగురాళ్ల పట్టణంలో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లను తీసుకొచ్చామని ఆయన తెలియజేశారు. వారికి ఏడురకాల పరీక్షలు చేయించి ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని క్యాంప్‌లు నిర్వహించి పరిష్కరించటం లేదా మెరుగైన వైద్యం కోసం హాస్పటల్స్ రిఫర్ చేయటం జరుగుతుందని ఆయన తెలియజేశారు. నాడు నేడు కింద స్కూల్స్ అభివృద్ధి, అమ్మ ఒడి, ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలిచ్చామని, అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయటం జరిగిందని దీని వలన పేదవాడు దేనికి ఇబ్బంది పడకుండా ఉంటాడని ఆయన తెలియజేశారు. అంతేకాకుండా పిడుగురాళ్ల పట్టణ శివారులోని మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టబోతున్నామని కాలి నొప్పి నుంచి గుండె నొప్పి వరకు మొత్తం వైద్య పరీక్షలు నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, వైస్ చైర్మన్ షేక్‌జైలాబ్దీన్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, 26వ వార్డు కౌన్సిలర్ అన్నెం పద్మావతి, వైఎస్సార్‌సీపీ బీసీ కన్వీనర్ కందులూరి శివయ్య, ఎస్సీ సెల్ కన్వీనర్ కాలే మాణిక్యరావు, యూత్ కన్వీనర్ మందా సుధీర్, మున్సిపల్‌కమీషనర్ ఎ. వెంకటేశ్వర్లు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా..
ఎంపీపీ ఏసూరి సాయిశంకర్

దుర్గి: పేద ప్రజల ఆరోగ్యానికి ప్రాముఖ్యత కలిస్తూ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించి పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ ఏసూరి సాయిశంకర్ అన్నారు. బుధవారం ధర్మవరం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును జెడ్పీటీసీ సభ్యుడు శెట్టిపల్లి యలమందతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గడపకు వైద్య సేవలను అందిస్తూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌కు కృషి చేస్తున్న ప్రభుత్వ చర్యలను ఆయన కొనియాడారు. జెడ్పీటీసీ సభ్యుడు శెట్టిపల్లి యలమంద మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తికి సరైన నిర్వచనాన్ని కల్పించిన సీఎం జగన్ ఆరోగ్య ప్రదాతగా నిలిచారన్నారు. ధర్మవరం, శ్యామరాజుపురం గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సంబంధిత వైద్యులు వివిధ పరీక్షలతో పాటు మందులను, హెల్త్ ప్రొఫైల్ షీట్‌ను అందజేశారు. ప్రతి రోగి వివరాలను వైద్యులు వారి మొబైల్ యాప్‌లో రిజిస్టర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సమతావాణి, సర్పంచ్ గంగారపులక్ష్మి వెంకటరెడ్డి, శ్యామరాజుపురం సర్పంచ్ గురుమూర్తి, ఎంపీటీసీ అరిగెల కొండలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తా వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ జానకిరాము, పంచాయతీ సెక్రటరీ టి.శివకుమార్, వీఆర్‌ఓ రంగారావు, వైద్యులు సతీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులున్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం పరిశీలిస్తున్న గురజాల ఎమ్మెల్యే కాసుమహేష్‌రెడ్డి



పరిశీలిస్తున్న ఎంపీపీ ఏసూరి సాయిశంకర్, జెడ్పీటీసీ సభ్యుడు యలమంద



వృద్ధులకు ఓపి కార్డులను అందచేస్తున్న ఎంపీపీ చౌడేశ్వరి, మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి

నేడు కారెంపూడిలో ..

కారెంపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత మెగా వైద్య శిబిరం కారెంపూడి బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైద్య శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో ఎండీ జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఆప్తమాలజీ స్పెషలిస్ట్ డాక్టర్లతో పాటు కారెంపూడి, గాదెవారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్లు, కంటి వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించనున్నారని తెలిపారు. రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేస్తారు. శిబిరం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశామని, కారెంపూడి పట్టణ ప్రజలు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

పేదవాని ఆరోగ్య రక్ష ..

రెంటచింతల: దేశంలో ఏ రాష్ట్రంలో అమలుచేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష మన రాష్ట్రంలో పేదలందరికి ఒక రక్ష అని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. బుధవారం ఆమె మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారికి వెంటనే వైద్య సహాయం అందచేయనున్నట్లు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న విప్లవాత్మకమైన పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయడం లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రజల శ్రేయస్సు కోసం ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అనారోగ్యంతో బాధపడేవారికి అండగా ఉంటుందన్నారు. ముందుగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడితే సోమ్లీబాయి, మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి, ఎంపీటీసీ కొర్రా మంగమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, డాక్టర్ ప్రదీప్ కుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ అనంత కోటేశ్వరరావు, ఆరోగ్య, పార్టీ నేత వడితే బుడ్డసైదా నాయక్, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలోనే వైద్యసేవలు

మాచవరం: ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేస్తూ, పేద ప్రజలకు క్షేత్ర స్థాయిలోనే వైద్య సేవలందిస్తూ ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరమని డీఎంహెచ్ఓ బి.రవి అన్నారు. మండలంలోని ఆకురాజుపల్లి (కొత్తపాలెం) గ్రామ సచివాలయం నందు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తూ, క్రిటికల్ కేసులు, దీర్ఘకాలిక రోగులను గుర్తించి, ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేస్తూ, వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. మొత్తం సుమారు 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఎస్.చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.ప్రసాదరావు, ఆర్.చంద్రహాసిత, జె.అన్వేష్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



సురక్ష శిబిరం నిర్వహణపై అధికారులతో చర్చిస్తున్న డీఎంహెచ్ఓ బి.రవి

పంట నమోదు తప్పనిసరి

పిడుగురాళ్లరూరల్: పంట నమోదు చేసుకున్న వెంటనే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీ కృష్ణదేవరాయులు అన్నారు. మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో రైతులకు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవటం వలన కలిగే ఉపయోగాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాపింగ్ చేసుకోవటం వలన ఉచిత పంటల బీమా, ధాన్యం కొనుగోలు, సున్నా వడ్డీ రుణాలు, పంటనష్టాలు, వ్యవసాయ ఉత్పాదకాల మీద రాయితీలు వర్తిస్తాయని అందుకే తప్పనిసరిగా రైతులు పంట ఈ క్రాపింగ్ బుక్ చేసుకోవాలని సూచించారు. రైతులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు జిరాక్స్, 1బి, పట్టాపాస్‌పుస్తకం జిరాక్స్ రైతు భరోసా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులకు అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ బైరపోగు కుమారి ఏలయ్య, ఎంపీటీసీ హస్సాన్, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి పంట ధ్వంసం



మాచర్ల రూరల్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మిర్చి మొక్కలను ధ్వంసం చేసిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ముళ్ళ రాజయ్యకు చెందిన రెండు ఎకరాల పొలంలో రెండు నెలల క్రితం మిర్చి మొక్కలు నాటాడు. అయితే మంగళవారం రాజయ్య భార్య సైదమ్మ మిర్చి మొక్కలకు బలం మందు పెట్టి సాయంత్రం వరకు పొలంలోనే ఉన్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం పొలంలో కలుపు తీసేందుకు కూలీలతో వెళ్ళగా పొలంలో మొక్కలు ధ్వంసం చేసినట్లుగా ఉండటంతో బోరున విలపించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

సత్తెనపల్లి: రోటరీ క్లబ్ ద్వారా వార్డులో అనేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని 23వ వార్డు కౌన్సిలర్ ఆకుల రమేష్ అన్నారు. కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి తుమ్మల వెంకటేష్ జన్మదినం సందర్భంగా వెంకటపతి నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం నోట్ బుక్స్, పెన్నులు, జామెంట్రీ బాక్సులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ బాపతు శ్రీనివాసరెడ్డి, జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్, అధ్యక్షుడు మాతంగి సాంబశివ రావు, సెక్రటరీ సరికొండ రమాదేవి, ట్రెజరర్ వనమా నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు.

కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించిన పీఆర్కే

మాచర్ల: పట్టణంలోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో త్వరలో నాక్ బృందం పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నాక్ బృందం సభ్యుల వివరాలు, బృందం పరిశీలించే వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు, మరో రూ.30 లక్షలతో ఏర్పాటు చేస్తున్న అదనపు సౌకర్యాలను పరిశీలించారు. ఈ నెల 6, 7 తేదీల్లో నాక్ బృందానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకుమార్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఎక్కడా రాజీ పడకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈయన వెంట జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కండేయరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, తురకా కిషోర్, ఎంఈఓ వేముల నాగయ్య తదితరులు ఉన్నారు.



కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

తపాలా ఉద్యోగుల నిరసన

రెంటచింతల: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద గ్రామీణ తపాలా కార్యాలయ ఉద్యోగులు(జీడీఎస్) ప్లకార్డులతో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 గంటల పనితో పాటు పూర్తిగా అన్ని ప్రయోజనాలు కల్పించాలని, జీడీఎస్‌కు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, జీడీఎస్ సీనియర్ ఉద్యోగులకు 12, 24, 36 సం.ల సర్వీస్‌కు అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, గ్రూపు ఇన్సూరెన్స్ రూ.5 లక్షలు కల్పించాలని, వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫారసులను ఖచ్చితంగా అమలుచేయాలన్నారు. టార్గెట్స్ మేళా రూపంలో జీడీఎస్ ఎదుర్కొంటున్న అన్ని వేధింపుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మౌలాలీ, మంత్రునాయక్, సుధారాణి, మార్కొండయ్య, సైదారావు, నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, వేణుగోపాల్‌రెడ్డి, సోమ్లానాయక్ తదితరులున్నారు.



గణపవరంలో పశు విజ్ఞాన బడి

నాదెండ్ల: జగనన్న పాల వెల్లువ యాప్‌లో రిజిస్టర్ అయిన పాడి రైతులకు త్వరలో జీడీసీసీ బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు పశువైద్యాధికారి శ్రీధర్ తెలిపారు. ఇప్పటికే సర్వే పూర్తయినందున గణపవరం గ్రామ పరిధిలో 101 మంది రైతులు రిజిస్టార్ చేసుకున్నట్లు తెలిపారు. స్థానిక పశు వైద్యశాలలో పశు విజ్ఞాన బడి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యశాల పరిధిలో ఇర్లపాడు, అప్పాపురం గ్రామాల్లో సర్వే పూర్తయిందని, 101 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారన్నారు. జీవాలకు పీపీఆర్ వ్యాక్సిన్లు, వైట్ క్యాటిల్స్‌కు ఎల్ఎస్‌బీ వ్యాక్సిన్లు, లేగదూడలకు బూసిల్లా వ్యాక్సిన్లు పూర్తి చేశామన్నారు. పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గర్భ నిర్ధారణ పరీక్షలు ఎప్పటికప్పుడు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పశు యజమానులు గ్రామీణ పశువైద్యశాలలో వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు.



పాడిరైతులతో మాట్లాడుతున్న పశు వైద్యాధికారి శ్రీధర్

ఈకేవైసీ తప్పనిసరి



క్రోసూరు: పంటలు సాగు చేస్తున్న రైతులందరూ ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో వి.వేణుగోపాల్ అన్నారు. క్రోసూరు ఆర్బీకేలో ఆయన రైతులతో మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు వరి, పత్తి, మిరప ఇతర పంటలు 13,260 ఎకరాల్లో సాగవుతున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 31 శాతం మాత్రమే ఈకేవైసీ నమోదు అయిందని తెలిపారు. ఈకేవైసీ అయితేనే రైతులకు ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయన్నారు. పంట నష్ట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల కనీస మద్దతు ధర లభిస్తాయన్నారు.

7న చలో అలంపూర్

నరసరావుపేట: ఎస్సీ వర్గీకరణ కోసం ఈనెల 7వ తేదీన అలంపూర్ నుంచి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేపట్టే మాదిగల విశ్వరూప మహాపాదయాత్ర విజయవంతం చేయాలని ఆ సంస్థ నాయకులు కోరారు. ఈ మేరకు ఎన్‌జీవో హోమ్‌లో బుధవారం పాదయాత్రకు చెందిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి పాదయాత్రకు బ్రహ్మరథం పట్టాలని పల్నాడు జిల్లా అధ్యక్షులు అద్దంకిబాబు మాదిగ, జిల్లా కన్వీనర్ కనుమూరి కోటేశ్వరరావు కోరారు. మహిళా జిల్లా అధ్యక్షురాలు దేవరకొండ సుశీల, జిల్లా ఉపాధ్యక్షులు సత్యానందం మాదిగ, , జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లవరపు బాబు మాదిగ, సీనియర్ నాయకులు శ్రీనుమాదిగ, నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చిరుగురి నాగరాజు మాదిగ పాల్గొన్నారు.

ప్రజల జీవితాలలో సంక్షేమ వెలుగులు



రెంటచింతల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న సుపరిపాలనలో ప్రజల జీవితాలలో సంక్షేమ వెలుగులు విరజిమ్ముతున్నాయని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం 43వ సచివాలయంలో 176వ రోజు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రెంటచింతలలోని అంతోనివారి కాలనీ, వెంకటేశ్వరస్వామి మాణ్యంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేసి ప్రతి కుటుంబానికి సీఎం జగన్ ఏఏ పథకాల ద్వారా ఎంత ఆర్థిక ప్రయోజనం కలిగించారో వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెంటచింతల గ్రామాభివృద్ధికి మన ప్రభుత్వం రూ.8.47 కోట్లు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామ ప్రజలకు రూ. 57 కోట్లు ఇప్పటి వరకు అందచేయడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందచేయడానికే సచివాలయ వ్యవస్థను, వలంటీర్లను ఏర్పాటు చేశారన్నారు. నవరత్నాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నవశకానికి నాంది పలకడంతో ఓర్వలేక ప్రతిపక్షాలు బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా 32 సంక్షేమ పథకాల ద్వారా పేదలకు మేలు చేస్తూ కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు అందించి అవినీతి రహిత పాలన చేస్తున్న వైఎస్ జగన్‌ను రాష్ట్ర ప్రజలు 2024 ఎన్నికలలో ఆదరించాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మా కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక లబ్ధిచేకూరిందని జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని రేగులమాన్యం కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. కాలనీలో ప్రతి గడపకూ వెళ్లిన పీఆర్కేకు ప్రజలు నుంచి అపూర్వ ఆదరణ లభించింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య, పీఆర్‌డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ పేర్ల చౌడమ్మ, జెడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం చిన బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, జేసీఎస్ పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ మోర్తల ఉమ, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్ రెడ్డి, దుర్గిమార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నేతలు మర్రి లూర్ధురాజు, బి.సంపూర్ణమ్మ, బత్తుల దేవ, బొల్లెద్దు ఇన్నయ్య, మర్రి ఫిలోమిన్ రాజు, దాసరి అంతోని, ఏఈలు షేక్ మస్తాన్ వలి, కె.నరేంద్రారెడ్డి, ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వర రావు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరలు పాల్గొన్నారు.

ఎన్ఐఏ దాడులు అప్రజాస్వామికం

నరసరావుపేట: ప్రజాసంఘాలపై ఎన్ఐఏ దాడులను సభ్యసమాజం మొత్తం ఖండించాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు కోరారు. ఇటీవల పీడీఎంకు చెందిన జి.రామకృష్ణ, నల్లపాటి రామారావు గృహాల్లో ఎన్ఐఏ చేసిన సోదాలను పురస్కరించుకొని బుధవారం ఎన్‌జీఓ హోం ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈనెల రెండో తేదీన తెలుగు రాష్ట్రాల్లో ఎన్ఐఏ చేసిన దాడులు అప్రజాస్వామికమన్నారు. నాయకులు ఇళ్లల్లో లేని సమయంలో ఇళ్ల తాళాలను పగులకొట్టి సోదాలు చేసి చుట్టుపక్కల వారిని వారి ఆచూకీ తెలియజేయాలని కోరుతూ భయభ్రాంతులకు గురిచేశారన్నారు.

అయ్యప్ప స్వామికి గ్రామోత్సవం

నాదెండ్ల: గణపవరం అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలకు బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. సుమారు 250 మంది అయ్యప్ప మాలధారులు గ్రామంలోని ఆలయాల్లో పీఠాలు ఏర్పాటు చేసుకుని దీక్ష చేపట్టారు. బుధవారం ప్రత్యేక పూజల అనంతరం వాహనంపై ఏర్పాటు చేసి సంప్రదాయ మేళతాళాలతో ఊరేగింపు చేపట్టారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

